వేంకటేశ్వర ఆలయంలో ధ్వజారోహణం

కొత్తపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్నేహపురికాలనీలో వెలసిన పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన సోమవారం ఆలయంలో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకస్వాములు సకల దేవతలనూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంప్రదాయ బద్ధంగా ఆహ్వానిస్తూ వేదమంత్రాల మధ్య గరుత్మంతుడి చిత్రం ఉన్న ధ్వజారోహణ ఘట్టాన్ని చేపట్టారు. ధ్వజారోహణ ఘట్టానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



గరుత్మంతుడి చిత్రం ఉన్న ధ్వజపటం

అలరించిన శాస్త్రీయ నృత్యం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అల్కాపురి లాస్య నృత్యాలయ తెంజర్ల విశాఖ ప్రకాష్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు అందరిని అలరించాయి. 20మంది చిన్నారులు త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలకు నృత్యాభినయం చేశారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరణ

ఓల్డ్‌మలక్‌పేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో గ్రేడ్‌వన్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చిలక నర్సింహారెడ్డిని ఉన్నతశ్రేణి కార్యదర్శిగా(ఎఫ్‌ఎసీ) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన దామోదర్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఫుల్‌అడిషినల్ ఇన్‌చార్జిగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉంటూ వారు తెచ్చే పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తూ మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయనను మార్కెట్ ఛైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మిశ్రీనివాస్, వైస్‌ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు మహ్మద్ షకీల్, అశోక్‌గౌడ్ సన్మానించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహారెడ్డి



లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్ రాజశేఖర్‌రెడ్డి

మూడు నెలల రేషన్ కోటాను తీసుకోవాలి

ఎల్‌బీనగర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలల రేషన్ కోటాను తప్పనిసరిగా తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పలు రేషన్ షాపులను సందర్శించి రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. వర్షాకాలం కారణంగా జూన్, జూలై, ఆగస్టు మాసాలకు చెందిన రేషన్ బియ్యం కోటాను ప్రభుత్వం ఈ నెలలోనే పంపిణీ చేస్తున్నదన్నారు. లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పలుసం శ్రీధర్ గౌడ్, సుధీర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నరేష్, శివ పాల్గొన్నారు.



పిల్లిగుడిసెలలో పర్యటిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి, తహసీల్దార్ జయశ్రీ

పిల్లి గుడిసెవాసులకు డబుల్ బెడ్‌రూంలు నిర్మించాలి

సైదాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ పరిధిలోని పిల్లి గుడిసెలలో నివసిస్తున్న పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి కోరారు. సోమవారం తహసీల్దార్ జయశ్రీతో కలిసి పర్యటించారు. గుడిసెవాసులకు ఇళ్ల కేటాయింపులపై త్వరలోనే రెవెన్యూ అధికారులు ప్రకటన చేసే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

వనస్థలిపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్ నార్త్ కాలనీలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ జేసీబీ సాయంతో సాయిబాబా ఆలయం రోడ్డులో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీవాసుల తరపున ఎమ్మెల్యేకి అధ్యక్షుడు పోగుల రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి

రూ.30లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

చాదర్‌ఘాట్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారం బస్తీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.30లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం చేశారని అన్నారు. ఇప్పటికైనా సీసీ రోడ్డు పనులను ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, బస్తీవాసులు ప్రభాకర్, శ్రీధర్‌గౌడ్, బ్రహ్మచారి, శ్రీకాంత్, జీవన్, కొప్పుల దినేష్‌కుమార్ పటేల్, యాదగిరి సురేందర్ పాల్గొన్నారు.



మూసారాంబాగ్ బస్తీలోని రామాలయం ముందున్న వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం కింది భాగం కొంత విరిగిపోయి పక్కన చెట్లపైకి ఒరిగింది. సోమవారం రామాలయంలో ఉన్న భారీ వృక్షం కూలడంతో దానితో పాటు విద్యుత్ స్తంభం కూలింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



ఎన్‌టీఆర్‌నగర్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ముద్దుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్



లింగోజిగూడ లిబర్టీ చౌరస్తాలో జెండా ఎగురవేసి తెలంగాణ ఉద్యమకారులను సత్కరిస్తున్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, ఇతర నేతలు



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు



జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేస్తున్న ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య, పాల్గొన్న ఉప కమిషనర్లు సేవ ఇస్లావత్, సుజాత తదితరులు



కర్మన్‌ఘాట్ విలేజీలో వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజ్‌కుమార్‌రెడ్డి



పెద్దఅంబర్‌పేట్‌లో జెండాను ఎగురవేస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ సుమంత్, సిబ్బంది



హయత్‌నగర్‌లో జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీపీ పి.శ్రీనివాసులు





దివ్యాంగుల కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న చైర్మన్ వీరయ్య



బాటసింగారంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సెక్రెటరీ శ్రీనివాస్, డైరెక్టర్లు



బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వేడుకల్లో పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి



సైదాబాద్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ కార్పొరేటర్ స్వర్ణలతారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీలు, గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాలు ఎగురవేశారు. రాజకీయ పార్టీల నాయకులు జాతీయ జెండాతో పాటు తమ పార్టీ పతాకాలను సైతం ఎగురవేశారు. అనంతరం జయశంకర్, మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులు చేసిన త్యాగాలు వృథా కాలేదన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలలో ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు.

- జోన్ బృందం



శాలివాహననగర్‌కాలనీలో వేడుకల్లో వైద్యులను సన్మానిస్తున్న హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి దండెం రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు భువనగిరి చంద్రశేఖర్



బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో జెండాకు గౌరవ వందనం సమర్పిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్



బడంగ్‌పేట్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి తదితరులు



హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగుర వేస్తున్న తహసీల్దార్ జానకి



కర్మన్‌ఘాట్ విలేజీలోని గాంధీ విగ్రహం వద్ద వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి



వ్యవసాయ మార్కెట్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మిశ్రీనివాస్

వంద రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభం

● ర్యాలీ నిర్వహించిన అధికారులు

సరూర్‌నగర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వంద రోజుల కార్యాచరణ ప్రణాళికపై ప్రతిజ్ఞ చేశారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. మొత్తం 50 అంశాలతో ఈ కార్యక్రమం ఉంటుందని, ఒక్కో రోజు ఒక్కో అంశాన్ని తీసుకుని వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకు ముందు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ శ్యాంసుందర్, డీఈఈ వెంకన్న, మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ వి.యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో ర్యాలీలో ఎస్‌వో శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ సరస్వతి తదితరులు

తుర్కయంజాల్‌లో అవగాహన ర్యాలీ

హయత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం తుర్కయంజాల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తుర్కయంజాల్ చౌరస్తా నుంచి ర్యాలీ మాసబ్ చెరువు వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఈ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. వంద రోజుల పాటు పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, శానిటేషన్ సిబ్బందికి హెల్త్ క్యాంపుల నిర్వహణ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ నియంత్రణ, రెవెన్యూ వసూలు, వీధి కుక్కల నియంత్రణ, వన మహోత్సవం లాంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వంద రోజుల్లో మున్సిపాలిటీని అన్ని విధాలు అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డీఈఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది

కనుల పండువగా బీరప్పస్వామి కల్యాణోత్సవం

సరూర్‌నగర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో మూడు రోజుల క్రితం ప్రారంభమైన బీరప్పస్వామి జాతరలో భాగంగా సోమవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక కురుమ సంఘం, ఒగ్గు కళాకారుల బృందం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉదయం 11.15గంటలకు బీరప్ప-కామరాతిదేవి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి, సాయంత్రం బలి కార్యక్రమం జరిపారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. గ్రామమంతా పసుపు బండారితో పచ్చగా మారిపోయింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, టీజీకాబ్ వైస్ చైర్మన్, రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్ రెడ్డి, జాతీయ నాయకుడు పేరాల శేఖర్‌జీ, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి తదితరులు బీరప్ప స్వామిని దర్శించుకున్నారు.



బీరప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



బీరప్పస్వామి సేవలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తదితరులు

ఫ్లైఓవర్ నిర్మాణంపై సమావేశం

మన్సూరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లోని పనామ చౌరస్తా నుంచి ఆటోనగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు విజయవాడ జాతీయ రహదారిపై నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై పరిసర కాలనీవాసులు, పెద్దల అభిప్రాయంపై సోమవారం వనస్థలిపురంలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్‌లో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో 950 మీటర్ల మేర నిర్మించే ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాజేందర్, డిజైన్ సెక్టార్ అథారిటీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ప్రణాళికతో కాలనీవాసుల రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా 7 అండర్‌పాస్‌లను రూపొందించారు. ఇందులో అతిభారీ, భారీ, చిన్న వాహనాలు వెళ్లేలా 100 ఫీట్లతో ఒకటి, 50 ఫీట్లతో రెండు, 40 ఫీట్లతో నాలుగు చొప్పున కేటాయించగా ఇందులో మధ్య భాగాన 100 ఫీట్ల అండర్‌పాస్, దీనికి ఇరువైపులా ఒకటి 50ఫీట్లు, రెండు 40ఫీట్ల అండర్‌పాస్‌లు ఉండేలా వాటిని ఎక్కడెక్కడ నిర్మించాలో ప్రణాళికలు వేసి అందరి అభిప్రాయాలను తీసుకున్నారు. ఏడు అండర్‌పాస్‌లతో నిర్మించి ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి సుమారు రూ.25కోట్ల అంచనా వ్యయాన్ని వేశారు. ఈ ప్రణాళికను దాదాపు అందరూ ఆమోదించారు. ఈ ప్రణాళికపై ప్రజల అభిప్రాయాలను స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి అందరికీ ఆమోదయోగంగా ఉండేలా బ్రిడ్జి పనులు చేపట్టేందుకు తమవంతు కృషి చేస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజన్‌కుమార్‌గౌడ్, కొత్త రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యుగెందర్‌రెడ్డి, పరిసరకాలనీ అసోసియేషన్ సభ్యులు, కమర్షియల్ భవనాల యజమానులు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణ ప్రణాళికపై తమ తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్న పరిసర కాలనీలు, కమర్షియల్ భవన యజమానులు

ఆపరేషన్ సిందూర్ ప్రేరణతో భిన్న రూపాల్లో దేశభక్తి

చాదర్‌ఘాట్ : ఆపరేషన్ సిందూర్‌పై ప్రేరణ పొందిన ప్రజలు భిన్న రూపాల్లో దేశభక్తిని చాటుకున్నారని రిటైర్డ్ కలెక్టర్ ఎంవీరెడ్డి అన్నారు. కోదాడ ఆత్మీయ ప్రవాస సమితి, అపోలో మెడికల్ అకాడమి సంయుక్తాధ్వర్యంలో శాల్యూట్ టు సోల్జర్స్ పేరుతో చైతన్యపురిలోని అపోలో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ బుర్రి రామయ్యతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సంగోజు నాగాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ఆర్మీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీరెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ బాధ్యతలతో త్రివిధ దళాల అధికారులు, సైనికుల సేవలను మనం గుర్తు తెచ్చుకోవాలన్నారు. రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువతను ఆర్మీలో చేరేందుకు అవకాశాలను కల్పించాలని వివరించారు. మాజీ ఆర్మీ అధికారులు కల్నల్ స్వర్ణారెడ్డి, సుబేదార్ మేజర్ సాయి, పీఎస్‌ఎన్ స్వామి, సార్జెంట్‌లు జి.నర్సింహారెడ్డి, రామనాథం, వనం సుదర్శన్, దయాకర్‌రెడ్డి, సుబేదారు ఎస్.నర్సయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపోలో అకాడమీ డైరెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.